
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5, కనిష్ఠం 20.6

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 22 ఫిబ్రవరి 2025

నేడు జిల్లాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

నిజామాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. బోధన్‌లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించనున్న సమావేశంలో ఆయన పాల్గొంటారు. అక్కడి నుంచి నేరుగా నిజామాబాద్‌కు రానున్నారు. నిజామాబాద్‌లో పార్టీ జిల్లా నేతలతో మాట్లాడటంతో పాటు ఎన్నికలపై సమీక్షిస్తారు. కాగా, కేంద్ర మంత్రి రాక సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

24న జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

» గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో పాల్గొననున్న సీఎం



నిజామాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 24న జిల్లాకు రానున్నారు. నిజామాబాద్‌లోని భూంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా జరిగే ప్రచారంలో ఆయన పాల్గొననున్నారు. సిట్టింగ్ స్థానం కావడంతో సీఎం కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ నెల 25న ప్రచారం ముగుస్తుండటంతో ఒకరోజు ముందుగా సీఎం జిల్లాకు వస్తున్నారు. సీఎం హాజరయ్యే ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో గ్రాడ్యుయేట్ ఓటర్లనే హాజరయ్యే విధంగా ఏర్పాట్లను పార్టీ నేతలు చేస్తున్నారు. సీఎం జిల్లాకు రానుండటంతో సభ విజయవంతం కోసం నేడు పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొననున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నిక కావడంతో సమావేశానికి మండలవారీగా ఓటర్లను మాత్రమే తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఇతర నేతలు హాజరుకానున్నారు. అదేరోజు సీఎం మొదట నిర్మల్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు మధ్యాహ్నం 2 గంటలకు హాజరవుతారు. ఇక్కడి నుంచి కరీంనగర్‌లో జరిగే సమావేశానికి వెళ్తారు. హెలికాప్టర్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రానుండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్‌లను పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి నిర్ణీత సమయంలో బ్యాలెట్ బాక్సుల తరలింపు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు. నిఘా బృందాల పనితీరు కూడా సక్రమంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ఈ ఎన్నికల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలను వివరించారు. తాగునీరు, వీల్‌చైర్స్‌తో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లపై రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వడంతో పాటు నిబంధనలు పాటించే విధంగా చూడాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అదనపు డీసీపీ కే.రాంచందర్‌రావు, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డీటీడబ్ల్యూవో నాగోరావుతో పాటు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



» గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు
» పార్టీల నేతలతో పాటు సొంత టీమ్‌ల ద్వారా ప్రచారం
» ఈ ఎన్నికల్లో వ్యక్తిగత ఆరోపణలకే ప్రచారంలో ప్రాధాన్యం
» బీఆర్ఎస్ మద్దతుదారుల మొగ్గువైపే అందరి దృష్టి

ప్రచారం.. వినూత్నం

నిజామాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం దగ్గర పడుతుండగా అభ్యర్థులు మాత్రం వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రాడ్యుయేట్‌లకు హామీలు ఇచ్చే విషయాలకన్న వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటూనే ముందుకు పోతున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకొని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచారానికి నాలుగు రోజులే గడువు ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా పూర్తిస్థాయిలో ఈ ఎన్నికలపై నజర్ పెట్టారు. తమ బలం, బలహీనతలను గుర్తించడంతో పాటు అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో గెలుపు కోసం రెండు పార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి దీటుగానే బీఎస్పీ అభ్యర్థితో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు కూడా ఇదే రీతిలో బీజేపీ అభ్యర్థితో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

వ్యక్తిగత ఆరోపణలపైనే ప్రచారం

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారం విభిన్న రీతిలో కొనసాగుతోంది. పోటీలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నా సమస్యల కన్న ఎక్కువగా ఈ దఫా వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటూనే ముందుకు పోతున్నారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ అభ్యర్థులుగా కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ పోటీలో ఉన్నారు. వీరే కాకుండా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్‌లు గట్టి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్ని కల్లో ఓటు వేసే నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లకు ఈ దఫా హామీలు ఇవ్వడం లేదు. తమ పార్టీల ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని చెబుతూనే వ్యక్తిగత ప్రకటనలే ఎక్కువగా చేస్తున్నారు. అభ్యర్థులు తమ పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులను రంగంలోకి దించడంతో పాటు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 42 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో కాంగ్రెస్‌కు 21 మంది ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. బీజేపీకి ఏడుగురు ఎమ్మెల్యేలతో పాటు నలుగురు ఎంపీలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలో లేకపోవడం వల్ల ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్యనే పోటీ కనిపిస్తోంది.

సిట్టింగ్ స్థానం నిలుపుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు

కాంగ్రెస్‌కు సిట్టింగ్ స్థానం కావడంతో మళ్లీ నిలుపుకునేందుకు ఎక్కువగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రచారానికి మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు తో పాటు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావులు కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, కాసుల బాల్‌రాజ్, గడుగు గంగాధర్‌తో పాటు ఇతర నేతలు పాల్గొంటున్నారు. వీరితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావుతో పాటు మిగతా నేతలు పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

గెలుపుకోసం బీజేపీ అభ్యర్థుల పావులు

కాంగ్రెస్‌కు దీటుగానే బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి కోసం పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈయనతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో పాటు ఎంపీలు అర్వింద్, రఘునందన్‌రావు, గోడెం నగేష్‌లు పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్య నారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, వెంకట్‌ర మణా రెడ్డిలు ఉమ్మడి జిల్లా పరిధిలో కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, నీలం రాజులతో పాటు పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో ప్రచారంపై దృష్టి పెట్టారు. ఇప్పటికే రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ కూడా జిల్లాకు వచ్చి ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు.

బీఎస్పీ అభ్యర్థి తరపున బీసీ సంఘాల ప్రచారం

ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ తరపున ఆయన అనుచరవర్గం, బీసీ, ఇతర సంఘాల నేతలు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పలు సంఘాలు మద్దతు ప్రకటిస్తూ గ్రాడ్యుయేట్‌ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరే కాకుండా ఇతర స్వతంత్ర అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్‌లు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కువ మంది స్వతంత్రులుగా ఉండటం వల్ల ప్రధాన పార్టీల నేతలు కూడా అప్రమత్తమై గ్రాడ్యుయేట్‌ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

బీఆర్ఎస్ మద్దతుపైనే అందరి దృష్టి

ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని నిలుపలేదు. ఎవరికి మద్దతు ప్రకటించలేదు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ క్యాడర్‌తో పాటు 14మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరు ఎవరికి మద్దతు ఇస్తారోనని చర్చ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఈపార్టీ మద్దతు దారులు ఎవరికి ఓటు వేస్తారోనని కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నేతలు అంచనాకు రాలేకపోతున్నారు. బీఆర్ఎస్ ఓట్లే ఈ రెండు పార్టీల నేతలకు కీలకం కానున్నాయి. గ్రాడ్యుయేట్ ఓటర్లలో కొంత మంది బీఆర్ఎస్ మద్దతుదారులు కూడా ఉండటం వల్ల అది ఏవైపు వెళ్తాయని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళనతో ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన నేతలకు మద్దతుగా మండల స్థాయిలో ప్రచారాన్ని యూనియన్ నేతలు నిర్వహించడంతో పాటు తమ అభ్యర్థుల గెలుపునకు ప్రయత్నాలు చేస్తున్నారు. పీఆర్‌టీయూతో పాటు ఇతర యూనియన్‌ల నేతలు పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నిలబడటంతో ఈ దఫా పార్టీల నేతలు కూడా నజర్ పెట్టారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి గెలిచాక రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. బెనిఫిట్స్ కూడా సరిగా ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. నిరుద్యోగతతో యువత ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లకు పరిమితం అవుతుంటే రిటైర్డ్‌మెంట్ కాలపరిమితి పెంచుతూ ఉద్యోగులపై భారం పెంచుతుందన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా

మిగతా 8వ పేజీలో...

దళారీ వ్యవస్థను అరికట్టాలి

మార్కెట్‌లో దళారులు, అధికారులు, పాలకవర్గం కుమ్మక్కు

మద్దతు ధరలేక నష్టపోతున్న పసుపు రైతులు : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పసుపు మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికట్టాలని లేదంటే రైతులతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రం ఎల్లమ్మగుట్టలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డులో దళారులు, అధికారులు, పాలకవర్గం కుమ్మక్కై పసుపు రైతులను మోసం చేస్తుందన్నారు. పసుపు క్వింటాలుకు రూ.10 వేల మద్దతు ధర కూడా పలకడం లేదని, మద్దతు ధరలేని బోర్డు గుండు సున్నాతో సమానం అన్నారు. పసుపు బోర్డు తెచ్చామని ప్రగల్బాలు పలుకుతున్న ఎంపీ అర్వింద్ కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. బీజేపీ నాయకులు నరేంద్రమోదీ దగ్గరికి వెళ్లి పసుపునకు మద్దతు ధర రూ.15వేలు కల్పించేలా చూడాలన్నారు. పసుపు బోర్డు ద్వారా పల్లె గంగారెడ్డికి చైర్మన్ కుర్చీ వచ్చింది కానీ పసుపు రైతులకు న్యాయం జరగలేదన్నారు. కటాఫ్ రేటు రూ.10వేల ధర కంటే తక్కువ ధర పలికితే రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. పసుపు బోర్డు లేని సమయంలోనే క్వింటా పసుపునకు రూ.18వేల ధర వచ్చిందన్నారు. పసుపు బోర్డు కార్యాలయం ఢిల్లీలో.. అధికారులు జిల్లాలో ఏం బోర్డో అర్థం కావడం లేదన్నారు. రూ.10వేలకు పసుపు అమ్ముడు పోతుంటే అర్వింద్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. జిల్లా మార్కెట్‌కు ఇతర మార్కెట్‌లను అనుసంధానం చేసి పసుపునకు ధర పెంచేలా చూడాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో పసుపు మద్దతు ధర రూ.12వేలు ఇస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన ఎల్‌ఆర్ఎస్ పథకం దాచుకోవడానికి దోచుకోవడానికని కాంగ్రెస్ నాయకులు విమర్శించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రూపాయి తీసుకోకుండా ఎల్‌ఆర్ఎస్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం డబ్బులు కట్టండి అని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని ప్రజలు ఎల్‌ఆర్ఎస్ డబ్బులు కట్టవద్దని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ చేయకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్‌పి అలీమ్, ప్రభాకర్, సత్యప్రకాశ్, సిర్పరాజు, నవీన్, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలస కుటుంబాల స్థితిగతులను మెరుగుపర్చాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వలస కుటుంబాల స్థితిగతులను మెరుగుపరిచేందుకు మైగ్రేషన్ మల్టీపార్ట్‌నర్ ఫండ్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కేంద్ర ప్రతినిధులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాను ఎంపిక చేశారని అన్నారు. ఎంఎంపీటీఎఫ్ అమలు చేయాల్సిన విధానం ఐక్యరాజ్యసమితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే తోడ్పాటు అంశాలను అధికారులకు వివరించారు. జిల్లా నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లిన వారి కోసం ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టారని అన్నారు. వారి స్థితిగతులను మార్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, జేడీఏ వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, డీపీవో శ్రీనివాస్, రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్‌తో పాటు యూఎన్‌వో ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సిజోసెఫ్, అనిల్ ఉప్పల్‌పాటి పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన

ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి



మార్కెట్‌లో పసుపును పరిశీలిస్తున్న నాయకులు

ఖిల్లా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ ప్రారంభమైన రైతుల నిరసన యాత్ర ఆలూరు, నందిపేట్, నవీపేట్, జాన్కంపేట్ మీదుగా శ్రద్ధానంద్‌గంజ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉందన్నారు. ఇది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు దృష్టిలో పెట్టుకుని రూపొందించిన విధానం అని అన్నారు. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కనపెట్టి, వ్యవసాయ మార్కెటింగ్ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న, ఎర్రసాయిలు, ఇడగొట్టి సాయిలు, గంగారాం, ఎర్రన్న పాల్గొన్నారు.

ఊట బావులతో

వ్యవసాయం

» జంగంపల్లిలో ఊట బావుల్లో పుష్కలంగా ఊరుతున్న నీరు
» 40 ఏళ్లుగా ఎండిన దాఖలాలు లేవు
» కాలంతో పనిలేకుండా రెండు పంటలు సాగుచేస్తున్నరైతులు

7



ఉపాధిహామీ పనులలో నిధుల దుర్వినియోగం

నవీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 32 గ్రామపంచాయతీల పరిధిలో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధిహామీ పనులలో 2,16,699రూపాయల నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎస్టీమేషన్ ఒక చోట ఉంటే ఫీల్డ్ పనులు మరో చోట చేపట్టడం, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి లోపాలను సోషల్ అడిట్‌లో అధికారులు గుర్తించారు.

'పిల్లల భవిష్యత్తు కోసం సహకరిస్తాం'

వర్ని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పేదరికం, విద్యాభ్యాసంలో రాణించే విద్యార్థినులకు ఎస్‌బీఐ బ్యాంకు తోడ్పాటునందించడంలో ముందుంటుందని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ మహేశ్వర్ కోనేటి పేర్కొన్నారు. వర్నిలోని సత్యనారాయణ పురం జడ్పీ హైస్కూల్ పాఠశాలలో శుక్రవారం పదిమంది విద్యార్థినులకు బ్యాంకు ద్వారా ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ రామ్మోహన్, వర్ని బ్రాంచ్ మేనేజర్ కిషోర్, గోపాల్, చిరంజీవి సేట్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుంకెట్‌లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పరమేష్‌ను పరామర్శించారు. ఇటీవల బీఆర్‌ఎస్ నాయకుడు మహిపాల్ ఆయన తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మహేష్ నానమ్మ చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ బద్దం రవి, తీగెల సందీప్, తీగెల గణేష్, తీగెల సుబాష్, మధుసూదన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

పదోతరగతి విద్యార్థుల మార్కుల పరిశీలన


మార్కులను పరిశీలిస్తున్న మానిటరింగ్ టీం సభ్యులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన శనివారం జరిగింది. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వివిధ రికార్డులను, పరీక్షల మార్కులను జిల్లా మానిటరింగ్ టీం సభ్యులు మధులనాల్, రమేష్ రవింద్రలు పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని కోనసముందర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రి మధుపాల్ కోరారు.

గొడవ ఘటనలో మూడునెలల జైలు

రెంజల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలం నీళ్ల కోసం జరిగిన కొట్లాట కేసులో బోధన్ కోర్టు న్యాయాధికారి నిందితుడికి మూడునెలల జైలుశిక్షతో పాటు 10వేల రూపాయల జరిమానా విధించినట్లు రెంజల్ ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 28-03-2019న తాడెం శంకర్ అనే వ్యక్తి బోరు మోటారు నుంచి అనుమతులు లేకుండా నీళ్లను ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన ఆనంద్‌బాబు అతని పొలానికి తీసుకెళ్తున్నాడన్నారు. ఈ విషయంపై జరిగిన ఘర్షణలో ఆనంద్‌బాబు శంకర్‌ను పైపులతో కొట్టి గాయపర్చాడన్నారు. శుక్రవారం బోధన్ కోర్టులో విచారణ పూర్తవగా న్యాయాధికారి నిందితుడు ఆనంద్ బాబుకు మూడు నెలల జైలుశిక్ష, 10వేల రూపాయల జరిమానా విధించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌కాయిల్స్ చోరీపై ఫిర్యాదు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడిజమాల్‌పూర్, నాగన్‌పల్లి గ్రామాల మధ్య గల పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ కాయిల్స్, ఆయిల్ గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసినట్లు బోధన్‌రూరల్ ట్రాన్స్‌కో ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. సీసీ పుటేజీల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్ దొంగలను పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

నవీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరన్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఒడ్డెర కాలనీకి చెందిన ఎత్తరి మల్లవ్వ(40) అనే మహిళ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. మల్లవ్వకు కొంతకాలంగా మతిస్థిమితం లేదని, గత శుక్రవారం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. శుక్రవారం గ్రామ శివారులో ఉన్న బావిలో ఆమె మృతదేహం లభ్యమైందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలికి భర్త గంగారాం, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోధన్‌లో పోలీసుల కవాతు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కవాతును ఏసీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని, పట్టభద్రుల ఎన్నికలను ప్రజలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన ప్రేమకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎల్‌వోసీని అందజేశారు. తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరింది. బాధితురాలికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. కాంగ్రెస్ నాయకులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష 25వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బేస్‌బాల్ సబ్ జూనియర్ బాలుర జిల్లా జట్టు ప్రాబబుల్స్‌ను శుక్రవారం ఆర్మూర్‌లో ఎంపిక చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు.

చిరుతపులి దాడిలో రెండు దూడల మృతి

నవీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం)లో గురువారం అర్ధరాత్రి చిరుతపులి దాడి చేసిన ఘటనలో రెండు దూడలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన బెల్లి అబ్బయ్య అనే రైతు తన ఇంటి సమీపంలో ఉన్న పశువుల కొట్టంలో మూడు ఆవులు, రెండు ఎద్దులతో పాటు మరో రెండు దూడలను కట్టి వేశాడు. కొట్టం లోపలి భాగంలో రెండు దూడలను కట్టివేసి ఉంచగా కొట్టం బయటి భాగంలో మిగతా పశువులను కట్టివేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో సమీపంలో ఉన్న గుట్ట ప్రాంతం నుంచి చిరుతపులి వచ్చి రెండు లేగదూడలను చంపివేసింది. ఒక లేగదూడ పొట్టను పూర్తిగా చీల్చివేయగా మరో లేగదూడ గొంతును గట్టిగా అదిమి పట్టడంతో మృతిచెందింది. శుక్రవారం సంఘటనా స్థలాన్ని నిజామాబాద్ నార్త్‌ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్, సెక్షన్ ఆఫీసర్ జహూర్, నవీపేట వెటర్నరీ వైద్యుడు నరేందర్, నిజామాబాద్ వెటర్నరీ వైద్యుడు హన్మంత్ రెడ్డిలు సందర్శించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్ మాట్లాడుతూ చిరుత దాడిచేసి చంపిందన్నారు.


మృతిచెందిన దూడ


పరిశీలించిన అధికారులు, వైద్యులు

మూసాయిదాను వెనక్కి తీసుకోవాలని నిరసన

పెర్కిట్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్ర వారం వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రైతులు నిరసన యాత్ర చేపట్టారు. ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ ఎదురుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చారిత్రాత్మక పోరాటం తర్వాత 2021 నవంబర్‌లో ప్రధాన మంత్రి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించారు. సరిగ్గా మూడేళ్ల తర్వాత అవే చట్టాలకు పేరు మార్చి మరోసారి అమల్లోకి తేచ్చే ప్రయత్నం చేస్తున్నారని, ఈ సందర్భంగా కేంద్రం కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసిందని మూడ్ శోభన్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఉపాధ్యక్షుడు భూమన్న, ప్రజా నట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, రైతు సంఘం నాయకులు గణేష్, సాయిలు, నర్సింగ్, ఎర్రన్న పాల్గొన్నారు.

నవీపేట : తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల నిరసన యాత్ర శుక్రవారం నవీపేటకు చేరుకుంది. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ జాతీయ విధాన కార్యచరణను తిరస్కరిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం ఆమోదించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆదరించండి


● డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి


కమ్మర్‌పల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

వేల్పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, విద్యావేత్త, సామాజికసేవ దృక్పథం గల నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం వేల్పూర్‌లో ఆయన ఎమ్మెల్సీ ఎఽన్నికల ప్రచారాన్ని నిర్వహించిన అనంతరం విలేకరుల ఆయన మాట్లాడారు. నరేందర్‌రెడ్డి సేవా భావాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అయిన తర్వాత 14నెలల వ్యవధిలో 60వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే నన్నారు. పేద విద్యార్థులకు అన్ని జిల్లాలలో అత్యున్నత విద్యప్రమాణాలతో గురు కుల విద్యాలయాలను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, నాయకులు చరణ్, భగవన్‌దాస్, ఇంద్రగౌడ్, మల్లారెడ్డి, దామోదర్‌గౌడ్, మల్లేష్, రమణ ఉన్నారు.

కమ్మర్‌పల్లి: త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేందర్ రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యాత ఓటు వేసి గెలిపించాలని కమ్మర్‌పల్లి లో మండల పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న ఓటర్లను కలిసి ప్రచారం చేశారు, కాగా మండలంలోని అన్ని గ్రామాలలో తమ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు సుంకెట శ్రీనివాస్, వేములవాడ జగదీశ్, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేంధర్‌రెడ్డిని గెలిపించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌బుక్య అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని విజయ హైస్కూల్, విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ప్రచారం నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే 56వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. అదే విధంగా ప్రతీనెల 1వ తారిఖున ఉద్యోగులందరికి, విశ్రాంత ఉద్యోగులకు వేతనాలు అందుతున్నాయన్నారు. మేధవులు, విద్యవంతులు ఆలోచించి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఏకైక ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, ఎఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, రాంరెడ్డి, జ్ఞానేశ్వర్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం నందిపేట మండల కేంద్రంలోని సాయిబాబా గార్డెన్‌లో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు గ్రాడ్యుయేట్ ఓటర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బలపర్చిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, పెంట ఇంద్రుడు, సాయిబాబాగౌడ్, సుదర్శన్, రాజేందర్, దేవిదాస్‌గౌడ్, జమీల్ పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

వరి పంట సాగులో మెలకువలు పాటించాలి


సదస్సులో రైతులతో రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో వ్యవ సాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు, సూచనలు, మేలకువలు పాటిస్తే వరి పంట దిగుబడి వస్తుందని కెవికె రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో వరి పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సుతో పాటు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు వరిసాగులో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ లింగకర్షక బుట్టలను పెట్టేపద్దతి డెమో చేయించి రైతులకు చూపించారు. అనంతరం రైతులకు వరికాండం తొలుచు పురుగు నివారణ కోసం లింగకర్షక బుట్టలను రైతులకు పంపిణి చేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి ఓన్నప్ప, వ్యవసాయాధికారులు దేవిక, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్ : మండలంలోని పల్లికొండ గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో రుద్రూర్ శాస్త్రవేత్తల బృందం పంట పొలాలను పరిశీలించారు. నాణ్యమైన వరి విత్తనాలను వాడాలని, నారు పోసినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరి పైరకు రసాయన ఎరువులు తగ్గించాలని, దీనికి బదులు పొలంలో జీలుగు విత్తనాలు అలాగే పశువుల పేడను వేసుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, శ్వేత, స్వప్న, అగ్రికల్చర్ ఏవో లావణ్య, ఏఈవో బార్గవ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో


మహాశివరాత్రి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రానున్న మహాశివరాత్రి పండుగతో పాటు అన్ని పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం మహాశివ రాత్రి కరపత్రాలను శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు భక్తిశ్రద్దలతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కమల, భూమేష్, సింగం లక్ష్మణ్, రాజీవ్, కమల, ఈవో రాములు, వేద పండితులు గణేష్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం


నవీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నవీపేట,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా మండలంలోని వివిధ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. నవీపేట, కోస్లీ, నాగేపూర్, యంచ, నందిగాం, బినోల గ్రామాలలో పట్టభద్రుల ఓటర్లను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మహేశ్వర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సుధాకర్ చారి, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, రాజశేఖర్, పిల్లి శ్రీకాంత్, వెంకటేష్ తదితరులున్నారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13నెలలు గడిచిన పట్టభద్రులకు ఇప్పటి వరకు చేసిందేమి లేదని వారు పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇప్పటి వరకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అబద్దపు హామీలను నమ్మవద్దన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరిగాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టభద్రులను కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, ఉద్యోగ కల్పన బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, మండల ప్రధాన కార్యదర్శి జీలకరి ప్రవీణ్, బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు శివ, బీజేపీ నాయకులు తిరుపతి, లక్ష్మణ్ గౌడ్, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 21:(ఆంధ్రజ్యోతి):నిత్యజీవితంలో విద్యకు ఉన్న అత్యున్నత స్థానం మరోదానికి లేదని వార్షిక పరీక్షల్లో బాగా చదివి మంచి మార్కులతో మంచి ఉత్తీర్ణత శాతాన్ని కళాశాలకు కీర్తి ప్రతిష్టలు అందించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వి కృష్ణ దాస్ సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సీనియర్ విద్యార్థుల వీడ్కోలు పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సాయన్న, అంగ్లబోధకులు రాజేశ్వర్ గౌడ్, ఆంగ్ల ఉపన్యాసకులు పల్లెశ్రీనివాస్ గౌడ్, తెలుగు అధ్యపకులు డాక్టర్ మండలోజు నర్సింహస్వామి, బోటని లెక్చరర్ మురళి కృష్ణ, బుచ్చయ్య, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మంథని గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రోటరీ క్లబ్ కోశాధికారి పట్వారి తులసీ పరీక్ష సామా గ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం శ్యామల, ఉపాధ్యాయులు నరహరి, శ్రీనివాస్, ఆనంద్, మోహన్, వేణుగోపా ల్, రాగిని, తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం వితరణ

వేల్పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం సౌండ్ సిస్టంను వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకకు పృధ్వీరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యబోధన కోసం అవసరమైన వాటిని సమకూర్చేందుకు తమ లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు.

ముప్కాల్‌లో మాతృభాష దినోత్సవం

ముప్కాల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం గంగారాం మాతృభాషలోని నైపుణ్యం, సాధిస్తే ఇతర బాషల్లో కూడా నైపుణ్యం అవలిలగా నేర్చుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో తెలుగుభాష ఉపాధ్యాయులు నవీన్, అహల్యా దేవి, పద్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్ ఉన్నత పాఠశాలలో పద్యపఠన పోటీలు నిర్వహించారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ, ప్రసాద్, పవన్, విజయ్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష అధ్యాపకులు నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, ఎన్‌సీసీ కెప్టెన్ బాబురావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీశ్రీశ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ స్వామి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని హంగర్గ బీసీ కాలనీలో శుక్రవారం అఖండ హరినామ సప్తహ ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఆయనకు మహిళలు ఘన స్వాగతం పలికారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

రెంజల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన జాదవ్ రవి కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. రెంజల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ట్రేస్ చేసి శుక్రవారం బాధితుడికి ఎస్ఐ సాయన్న సెల్‌ఫోన్ అందజేయడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అందించినందుకు ఎస్ఐ సాయన్న, కానిస్టేబుల్ గణేష్‌కు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అదృశ్యమైన తల్లి, కొడుకుల ఆచూకీ లభ్యం

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు జ్యోతి తన ఏడాదిన్నర కుమారుడితో కలిసి ఈనెల 5వ తేదీన అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో పోలీసులు గాలించారు. ఈ నెల 14వ తేదీన తమ పోలీసు బృందానికి జ్యోతి ఆచూకీ లభ్యమైందన్నారు. కరీంనగర్‌లో ఆమెను పట్టుకుని బాలుడి ఆచూకీ కోసం గాలించామన్నారు. గురువారం రాత్రి కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడిని వెతికి పట్టుకున్నామన్నారు. తల్లితో పాటు బాలుడు అద్వైత్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. సిబ్బందిని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ఎత్తొండలో రక్తదాన శిబిరం

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎత్తొండ గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో యువకులు స్వచ్చందంగా పాల్గొని 24 యూనిట్ల రక్తదానం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు హన్మంత్‌రావు, బర్ల రవి, వెంకటేశం, యూత్ సభ్యులు జగదీష్, శ్యామ్, కార్తిక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోటగిరి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. వంటగది, సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. హాస్టల్ గదులను పరిశీలించి శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖాలిక్, వార్డెన్ అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహల నిర్మూలనపై బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ వెంకట నారాయణ బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధన సంస్థ ఆధ్వర్యంలో జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్స్ ప్రాజెక్టులో భాగంగా బాల కార్మికులు, బాలల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు.

యోగా ప్రాధాన్యతపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో యోగా ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.చంద్రిక తెలిపారు. ప్రతీనిత్యం యోగా అసనాలు చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు శారీరక, మానసిక దృడత్వం కలుగుతాయని, సరైన ఆహారం తీసుకుంటూ యోగసనాలు వేయడం వల్ల ఏలాంటి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.సుజాత, అధ్యాపకులు చైతన్య శాంతి, శిరీష పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు హార్వేస్టర్ దగ్ధం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ గంగటవర్స్ వద్ద హార్వేస్టర్ వాహనం గురువారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. భైంసా మండలం కమోల్ గ్రామం నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం హార్వేస్టర్‌ను తీసుకురాగా కొటార్మూర్‌లో ఖాళీ ప్రదేశంలో పార్కు చేయగా హార్వేస్టర్ వాహనంపై ఉన్న విద్యుత్ తీగెల వల్ల వాహనానికి నిప్పంటుకుంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

నిప్పంటుకొని వృద్ధుడి మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దోబీఘాట్ వద్ద గురువారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సీతారామారావు (75) అనే వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత 15 ఏళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న సీతరామారావును దోబీఘాట్ సమీపంలో షెడ్డు వేసుకొని అందులో నివసిస్తున్నాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు చెత్తలోని నిప్పుషెడ్డుకు అంటుకోవడంతో సీతారామారావు మంటల్లో కాలిపోయి మృతిచెందినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు రామేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

భీమ్‌గల్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని కస్తూర్భాగాంధీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు తెలిపారు.

అనుమతి లేకుండా డీజేలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా డిజేలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్.తిరుపతి హెచ్చరించారు. ఏలాంటి అనుమతులు లేకుండా ముందస్తు అనుమతి తీసుకోకుండా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన జక్కం సాయిచరణ్ పడకల్‌లో గురువారం డీజేను నడిపి పబ్లిక్‌ను న్యూసెన్స్ చేయగా శుక్రవారం జక్రాన్‌పల్లి తహసీల్దార్ కిరణ్మాయి ఎదుట జక్కం సాయిచరణ్‌ను బైండోవర్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ నుంచి కోటగిరి వైపు వస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఫటా.. ఫట్...

మార్చి 31లోగా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

• నిట్టు కిషన్‌రావు, ఈవో, నడిపల్లి



రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్ల క్రమ బద్దీకరణ కోసం ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ చేసుకోని లబ్ధిదారులు మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించుకొని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని నడిపల్లి ఈ వో నిట్టు కిషన్ రావు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి: ఎల్ఆర్ఎస్ చేసుకొని వారు ఎప్పటి వరకు అవకాశం కల్పించారు?

ఈవో: ఎల్ఆర్ఎస్ చేసుకొని వారు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు మార్చి 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు పంచాయతీ పరిధిలో ఎన్ని ప్లాట్లను ఎల్ఆర్ఎస్‌కు నమోదు చేశారు?

ఈవో: నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ ద్వార 2300 చేయగా 400ప్లాట్లు ఎల్ఆర్ఎస్ ద్వార ఆన్‌లైన్ పూర్తి చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఎవరికి ఎల్ఆర్ఎస్ వర్తింపజేస్తారు?

ఈవో: నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నడిపల్లి, డిచ్‌పల్లి స్టేషన్, గాంధీనగర్ కాలనీ ప్రజలకు తమ ప్లాట్ల క్రమబద్ధీకణకు అవకాశం కల్పించడం జరిగింది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

• (ఆంధ్రజ్యోతి,మద్నూర్)

బేస్‌బాల్ ప్రాబబుల్స్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా బేస్‌బాల్ బాలికల ప్రాబబుల్స్ జట్టు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో సుద్దపల్లిలో శుక్రవారం బేస్‌బాల్ జూనియర్ బాలికల ప్రాబబుల్స్ జట్టు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసుదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ తెలిపారు. ఈ ఎంపికైన జట్టు క్రీడాకారులు ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు గజ్వేల్‌లోని కేజీ టు పీజీ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ నళిని, ఎంపికైన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జట్టు ప్రథమ స్థానంలో నిలవా లని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, జిల్లా సాఫ్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గం గామోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, పీఈటీ జ్యోత్స్న, వ్యాయమ ఉపాధ్యాయులు వీణా, శ్రీలత, కోచ్ మౌనిక పాల్గొన్నారు.

కోటగిరిలో ముగిసిన అఖండ హరినామ సప్తాహ



సప్తాహలో అన్ను మహరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో వారం రోజుల పాటు కొనసాగిన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. వారం రోజుల పాటు సప్తహాలో ఉదయం, రాత్రి సంకీర్తనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. చివరిరోజు అన్ను మహారాజ్ సప్తహా కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని దైవ చింతనను అలవర్చుకుంటే అన్నీ సమస్యలు దూరమవుతాయని పేర్కొన్నారు. అనంతరం రవి యువసేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అనీల్, నాయకులు ఆనంద్, మోహన్, సంతోష్, శ్రీధర్, నగేష్, గంగాధర్, శ్యామ్ సుందర్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఊట బావులతో వ్యవసాయం

• జంగంపల్లిలో ఊట బావుల్లో పుష్కలంగా ఊరుతున్న నీరు • 40 ఏళ్లుగా ఎండని బావి • కాలంతో పనిలేకుండా రెండు పంటలు తీస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి పరిశీలన





జంగంపల్లిలోని ఊట బావులు



భిక్కనూరు సిద్దరామేశ్వర ఆలయంలోని గిలక బావి

భిక్కనూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నీటి కోసం ప్రతీఒక్కరు పరితపిస్తున్న రోజులివి. కాలం కాకపోయిన, ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోయిన ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కోనడమే కాకుండా పంటల సాగుకు సరిగా నీరందక పంటలు ఎండి తీవ్రంగా నష్టపోతుంటారు. ఇప్పటి పరిస్థితుల్లో ఎన్నిబోర్లు వేసిన పడని పరిస్థితి ఉంది. ఒక్కో రైతుల 400ల నుంచి దాదాపు 1000 ఫీట్ల వరకు డ్రిల్లింగ్ చేస్తున్న ఒక్క చుక్కకూడా పడని పరిస్థితిని చూస్తున్నాం. దీంతో పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి, బోరుబావి తవ్వేందుకు చేసిన ఖర్చులు రైతులకు బారంగా మారుతున్నాయి. కానీ భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో మాత్రం పలువురి రైతుల పంటలు కాలంతో సంబంధం లేకుండా పంటలు ఎప్పుడూ పచ్చగాదర్శనమిస్తున్నాయి. అందుకు కారణం గ్రామంలో ఉన్న ఊట బావులే. జంగంపల్లి గ్రామంలో దాదాపు పదుల సంఖ్యలో రైతులు గత చాల సంవత్సరాలుగా ఊట బావులతో వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. ఇప్పటి వరకు వారికి తెలిసి ఎన్నో యేండ్లుగా ఆ ఊట బావులు ఎండిన పరిస్థితి లేదు. వారికి ఎండలు బాగా ఉండి చెరువులు, కుంటలు ఎండుతున్న, భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్న భయం ఆ రైతులకు లేనేలేదు. భూగర్భ జలాలను సహజ పద్దతిలో వినియోగిస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలవడంతో పాటుగా రెండు కాలాలు పంటలు సాగుచేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

40 ఏళ్లుగా ఎండిన దాఖలాలు లేవు

ఈ గ్రామంలో ఉన్న ఊట బావుల్లో చాలా ఏళ్లగా నీరు సహజసిద్ధంగా ఊరుతుంది. గత 40 సంవత్సరాలుగా ఈ ఊట బావులు ఎండిన దాఖలాలు లేవు. ఎండకాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండి భూగర్భ జలాలు అడుగంటిపోయిన, చుట్టూ ఉన్న చెరువులు, కుంటలు ఎండిపోయిన, సంవత్సరాల పాటు కాలం కాకపోయిన ఈ ఊట బావుల్లో మాత్రం ఎల్లప్పుడూ నీరు పుష్కలంగా ఉంటుంది. ఎక్కడి నుంచి నీరు ఊరుతుందో తెలియదు కానీ ఎల్లప్పుడూ నీళ్లు ఊరుతూనే ఉంటాయి. వర్షాకాలంతో అయితే నీరు ఈ ఊటబావుల్లో మరింత పైకి చేరుతుంది. ఎండ కాలంలో పంటకు నీటి ఎద్దడి లేకుండా ఈ రైతులకు ఊట బావులు ఉపశమనం కలిగిస్తున్నాయి.



నాకు బుద్ది తెలిసిన నుంచి ఊట బావి ఎండిపోలేదు..

• గుండా రాజు, రైతు.. జంగంపల్లి

నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచి మా వ్యవసాయ క్షేత్రంలోని ఊట బావి ఎన్నడూ ఎండిపోలేదు. మా తండ్రి ఈ ఊట బావి నీళ్లను ఉపయోగించే వ్యవసాయం చేసిండు, ప్రస్తుతం నేను కూడా దీనిద్వారానే వ్యవ సా యం చేస్తున్నా. మాకు కాలంతోటి ఏమి పని లేదు. ఏ కాలమైనా మా ఊట బావిలో నీరు పుష్కలంగా ఉంటుంది. ప్రతీ యేడు ఆడుతూ పాడుతూ రెండు పంటలు తీస్తా. గతంలో ఏడు సంవత్సరాల కాలంపోయి చుట్టూ చెరువులు, కుంటలు ఎండిన దింట్లో నీరు ఎండిపోదు.



మాకు ఈ ఊట బావే ఆధారం

• గుండా శ్రీనివాస్, రైతు, జంగంపల్లి

మాకు ఈ ఊట బావే ఆధారం. ఈ ఊట బావిలో నీరు ఎలప్పుడూ ఉంటుంది. ఈ ఊట బావి నుంచి పంటలకు ఎన్ని నీరు తీసిన మళ్లి మళ్లి నీరు ఊరుతూనే ఉంటుంది. వరి పంటతో పాటుగా మొక్క జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నా. ఎన్నేళ్ల కాలం పోయినా మాకు నీటి సమస్య ఎన్నడూ రాలేదు. ఈ ఊట బావిని నమ్ముకునే ఇన్నేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ మా కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

కాలంతో పనిలేకుండా పంటలు పండిస్తున్న రైతులు

ఈ ఊట బావులు ఉన్న రైతులు కాలం అయిన కాకపోయిన ఎట్టి పరిస్థితుల్లో రెండు పంటలు పండించి మంచి దిగుబడి సాధిస్తున్నారు. ఈ ఊట బావులలో నీరు పుష్కలంగా ఉండటంతో వరి పంటనే కాకుండా మొక్కజోన్న, వరి, కూరగాయలను పండిస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటి పోయి చుట్టూ ఉన్న బోర్లు మూగబోయిన, పంటలు ఎండే పరిస్థితి ఉన్న గ్రామంలో ఊట బావులు ఉన్న చోట మాత్రం పంటలు ఎల్లప్పుడూ పచ్చగా దర్శనమిస్తున్నాయి.

పలు గ్రామాల్లోనూ ఊట, దిగుడు, గిలక బావులు

జంగంపల్లితో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో ఊట బావులు, దిగుడు బావులు, ఊట బావులు దర్శనమిస్తాయి. ముఖ్యంగా మండలం లోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలోని మూలబావి (గిలకబావి)లో ఎప్పుడూ నీరు ఎండిపోదు. ఈ బావిలో నీరు ఊరుతూనే ఉంటుంది. ఈ నీటిని తాగితే రోగాలు తొలిగి పోతాయన్న నమ్మకం ఉంది. మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో ఈ ఊట బావులు, గిలక బావులు, దిగుడు బావులు ఇంటి సముదాయాల్లో, వ్యవసాయ బావుల వద్ద ఉన్నాయి. వీటిని ఇప్పటికీ ప్రజలు వాడుతున్నారు.

పిల్లలు వాహనాలు నడపొద్దు

● నిబంధనలు తెలియక ప్రమాదాలకు కారణం అవుతున్నారని హెచ్చరిక
● వాహనమిచ్చిన వారిపై చర్యలు తప్పవు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల నిండని వారికి మన దేశంలో వాహనాలు నడపడానికి అనుమతి లేదు. తల్లిదండ్రులు లేదా బంధువుల వాహనాలను తీసుకుని నడపాలని పిల్లలు ఆత్రుత పడుతుంటారు. పెద్దలు ఏదైనా పని చెబితే బైక్ ఇవ్వాలని తల్లిదండ్రులతో పిల్లలు మారం చేయడం మొండికేయడం వంటివి చేస్తుం టారు. కొన్నిసార్లు తమ పిల్లలను ఏమనలేక ఉదారత చూపుతూ తాళం చెవి ఇచ్చేస్తారు. అయితే పిల్లలు వాహనంతో బయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు ఆందోళన చెందుతుంటారు. ఈ నేపథ్యంలో మైన ర్లకు వాహనాలు ఇస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో ప్రతీఒక్కరు తెలుసుకోవాలి.

● నిబంధనలు తెలియక ప్రమాదాలు

పోలీసుల తనిఖీల్లో 18 ఏళ్ల నిండని వారు కొందరు వాహనాలతో పట్టుబడుతుంటారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, జాతీయ రహదారి వంటి ప్రాంతాలలో మైనర్లు చక్కర్లు కొడుతూ పోలీసులకు చెబుతున్నారు. మైనర్లకు నిబంధనలు తెలియక రహదారులు వేగం మార్గదర్శకాలు గుర్తించక బైక్‌పై వెళుతూ ప్రమాదాల బారిన పడటం లేదా ఎదుటి వారిని ఢీకొట్టడమే వంటివి చేస్తుంటారు. మైనర్‌కు వాహనాలతో రోడ్లపై వస్తు ఎదుటి వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. మైనర్లు వాహనాలతో రోడ్లపై పోలీసులకు పట్టుబడితే తాళాలు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా తల్లిదండ్రుల్లో ఇంకా మార్పు రావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

● ప్రాణ హాని కలిగితే జీవిత ఖైదు

లైసెన్స్ కలిగిన వారు రోడ్డు ప్రమాదంలో ఎదుటి వ్యక్తి ప్రాణాలు పోవడానికి కారణమైతే బాలుడు, యజమానిపై నాన్ బేలబుల్ కేసు నమోదు అవుతుంది. కేసుతో పాటు ఐదేళ్ల కారాగార శిక్షలు పడే అవకాశం ఉందని చట్టం చెబుతోంది.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం

● బొజ్జ మహేష్, ఎల్లారెడ్డి ఎస్సై



మైనర్లు బైక్‌లు నడిపితే పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి జరిమానా విధిస్తాం. పిల్లలను వాహన యజమానులు తల్లిదండ్రులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలతో రోడ్లపైన పంపిం చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం ఈ విషయంపై పట్టణ కేంద్రంతో పాటు గ్రామాల ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

టీయూలో ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



భోగ్ భండార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను తెలంగాణ యూనివర్సిటీలోని ఎస్సీ ఎస్టీ సెల్ బంజార ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన వేడుకల్లో వీసీ మాట్లాడుతూ భారతదశంలో బంజారాల సంస్కృతి సంప్రదాయలు గొప్పవని అన్నారు. గౌతమ బుద్ధుని ఆశయాలతో ఆచరణలో చూయించి సంచార జీవితం నుంచి స్థిర నివాసానికి అడుగులు వేసిన గొప్ప సంస్కర్త సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. మహాత్ములు ప్రబోధించే 22 కమాండెన్సును విస్తృతంగా ప్రచారం చేశారని తెలిపారు. జాతుల విముక్తి పోరాటంలో సంత్ సేవాలాల్ మహరాజ్ కృషి మరువలేనిదని రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్య అతిథులకు రంగు రంగుల తలపాగాలను బంజార విద్యార్థులు పెట్టడంతో వేడుకలు మొత్తం రంగులమయంగా సంబరమాశ్చర్యం కలిగించేలా కనిపించింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వ పీజీ కళాశాల ప్రి న్సిపాల్ రఘునాథ్, టీయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ధరవత్ నాగరాజు, నిజామాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యుడు డా.బిలోజీ నాయక్, శ్రీను నాయక్, డా.రమేశ్ నాయక్, కిరణ్ రాథోడ్, ప్రవీణ్ రాజు, గిరిజన శక్తి వర్సిటీ అధ్యక్షుడు శ్రీను నాయక్, బంజార విద్యార్థులు, బంజార అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తి



ఆలయంలో కొలువైన శ్రీశివసాయి లింగేశ్వరస్వామి



నునుగొండ శ్యామల జ్ఞాపకార్థం నిర్మించిన కల్యాణ మండపం



36 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

భక్తుల కొంగు బంగారం 'పడిలేచిన మర్రిచెట్టు'

● ఆలయ ఆవరణలో కొలువైన సాయిబాబా, హన్మాన్ విగ్రహాలు ● దాతల సాయంతో 36 అడుగుల హన్మాన్ విగ్రహం, కల్యాణ మండపాల నిర్మాణాలు

ముప్కాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు అని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ వృక్షం సుమారు 200 ఏళ్ల క్రితం నుంచి ఉన్న ఈ (పడిలేచిన మర్రిచెట్టు) మహాలింగేశ్వర స్వామి, వటవృక్షం గత 20 ఏళ్ల క్రితం 2005 జనవరి 28వ తేదీన భారీ ఈదురుగాలులకు ఆకస్మాత్తుగా నెలకొరగడం జరిగింది. 33 అడుగుల వృత్త విస్తీర్ణమైన ఈ మర్రిచెట్టు వృక్షరాజు కూకటి వేళ్లతో సహా పడిపోవడంతో జరిగింది. అనంతరం అదే సంవత్సరం 2005జూన్ 24వ తేదీన శుక్రవారం ఎలాంటి మానవ ప్రయత్నం లేకుండా యాదస్థానంలో పునఃప్రతిష్ఠమై లేచి నిలబడిందని గ్రామస్థులు పేర్కొన్నారు. పడిలేచిన మర్రిచెట్టుకు అనాటి నుంచి నేటి వరకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పడిలేచిన మర్రిచెట్టు మహాలింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. మొక్కులు తీరిన భక్తులు, కుటుంబ సమేతంగా సోమవారం వచ్చి కట్టిన ముడుపులను తీసివేసి సత్యనారాయణ వ్రతం చేసి భోజనాలు చేస్తూ స్వామివారిని దర్శించుకొని భక్తులు వెళ్తుంటారు.

ప్రతీ సోమవారం పండుగ వాతావరణం

ప్రతీ సోమవారం పడిలేచిన మర్రిచెట్టు ఆలయం వద్ద పండగ వాతావరణం నెలకొంటుంది. చుట్టు పక్కల గ్రామల నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి కూడా ఎంతో మంది భక్తులు వారి కుటంబ సమేతంగా ఎక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి రోజు రోజుకు పెరుగుతున్న భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ పవిత్ర స్థలమైన శ్రీమహాలింగేశ్వరస్వామి పడిలేచిన మర్రిచెట్టు ప్రతీరోజు భక్తుల పూజలు అందుకుంటుందని పూరోహితులు అంటున్నారు. ప్రతీ గురువారం సాయిబాబా హారతి తర్వాత అన్నదాన కార్యక్రమం ఉంటుందని, ఈ నెల 26న మహాశివరాత్రి పురస్కరించు కొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రికి మూ డు రోజుల ముందు నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. గ్రామంలోని యువకులు, పెద్దలు దాదాపు 20నుంచి 40మంది వరకు 41రోజులు శివదీక్షలు తీసుకున్న స్వాములు ఆలయం ఆవరణలో ఉంటారు. శివ రాత్రి పర్వదిన రాత్రి జాగారం చేసి మరుసటి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాలతీసి దీక్ష విరమిస్తారు. శివరాత్రి ఉపవాస ఉన్న భక్తులు మరుసటి రోజు మహా అన్నదాన కార్యక్రమంలో ఉపవాస దీక్షలు విరమిస్తారు. పడిలేచిన మర్రిచెట్టు పక్కన సాయిబాబా ఆలయం పక్కన 36 అడుగుల భారీ ఆంజనేయ విగ్రహం కొలువైంది. ఈ విగ్రహ దాత నునుగొండ అంజయ్య, మనుగొండ శ్యామల జ్ఞాపకార్థం. శ్యామల కల్యాణ మండపం, యాగశాల నిర్మించారు. మహాలింగేశ్వర స్వామి పడిలేచిన మర్రిచెట్టు చుట్టు పక్కల భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా ధర్మశాల, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్ స్థలం కూడా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు.

శివరాత్రికి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశాం

● సిద్ధి రమేష్, వీడీసీ అధ్యక్షుడు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పడిలేచిన మర్రిచెట్టు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులు ఏటువంటి ఇబ్బందుల కలుగకుండా చలువ పందిళ్లు, నీటి వసతి, పార్కింగ్, వసతి వంటి అన్ని ఏర్పాట్లు చేశాం. శివరాత్రికి భక్తుల కోసం పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేయనున్నాం.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు మార్చి 24, 25 తేదీలలో జరగాల్సిన రెండు రోజుల నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం నగరంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎదుట సిబ్బంది ఆందోళన చేపట్టారు. వారానికి ఐదు రోజుల పనిదినాలను 2024 డిసెంబరు24 నుంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇంకా ఫైల్ పెండింగ్‌లో ఉన్నందున వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు మరింత త్వరితగతిన ప్రజలకు అందించాలంటే అన్ని కేటగిరిలలో తగినంత నియామకాలు చేపట్టాలన్నారు. బ్యాంకర్లపై సామాజిక వ్యతిరేక శక్తులు వికృతంగా ప్రవర్తించే సంఘటనలకు ప్రతిస్పందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల గ్రాడ్యుయిటీ 25లక్షలు వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల సిబ్బందికి వర్తిస్తున్న లాభాలు వారియొక్క లాభాల నుంచే తీసుకోవడం జరుగుతుందని వీటిపై ప్రభుత్వం విధిస్తున్న ఆదాయపన్నును బ్యాంకు యొక్క యాజమాన్యమే భరించాలన్నారు. బ్యాంకు యొక్క నియామకాలు తాత్కాలిక ప్రతిపాదనలే కాకుండా శాశ్వత ఉద్యోగ కల్పన చేయాలన్నారు. ఈ ఆందోళనలో ఎస్‌బీఐ డీజీఎస్ రమేష్, ఏజీఎస్ గురునాథ్, ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్


ఖిల్లా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నుంచి మోస్రా వెళ్లే దారిలో రాత్రి వేళ దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బిహార్‌కు చెందిన కుందన్, విజయ్, సుందరంలు నగర శివారులో హమాలీలుగా పని చేస్తున్నారన్నారు. మద్యానికి, చెడు వెసనాలకు బానిసలైన వీరు దాడి దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 19న అర్ధరాత్రి నిజామాబాద్ నుంచి వర్ని వెళ్తున్న జితేష్ అడ్డగించి చితకబాదారన్నారు. ఆయన వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌తో పాటు కెమరాను లాక్కుని పారిపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్సై ఎండీ ఆరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం ఇవ్వడం లేదు

● సూపర్‌వైజర్‌కు తల్లిదండ్రుల ఫిర్యాదు

మోస్రా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు టీచర్‌పై సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీలో పిల్లల కోసం ఆహారం అందించాల్సి ఉండగా సదరు టీచర్ అంగన్‌వాడీ కేంద్రంలో వంట చేయకుండా ఇంటి నుంచి ప్లాస్టిక్ కవర్‌లో ఆహార పదార్థంను తీసుకొని రావడంతో పిల్లల కుటుంబసభ్యులు ఆమెను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారాన్ని వంట చేయడానికి నియమితులైన ఆయా ద్వారా వంట చేయించకుండా ఇంటి నుంచి ఎందుకు తీసుకొస్తున్నావని ఆమెను నిలదీశారు. ఈ విషయమై ఆయాతో పాటు పిల్లల కుటుంబసభ్యులు సంబంధిత సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సూపర్‌వైజర్ సుమలత అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని వాస్తవాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారాన్ని అందించాలని సదరు టీచర్‌కు సూచించారు. చేసిన తప్పును సరిదిద్దుకోవాలని తెలిపారు. ఇటువంటివి మరోసారి జరగకుండా చూసుకోవాలని అన్నారు. తాము చేసిన తప్పులు మరో మారు జరుగకుండా చర్యలు తీసుకుంటామని రాతపూర్వకంగా టీచర్ రాసి ఇవ్వడంతో సూపర్‌వైజర్ మొదటి తప్పుగా భావించి మెమో ఇచ్చారు. తదుపరి ఇటువంటి అవకతవకలు జరిగితే శాఖపరంగా షోకాస్ నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఆర్‌టీయూ ద్వారానే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక సౌకర్యాలు పొందుతున్నారంటే దానికి పీఆర్‌టీయూ టీఎస్ కారణం అని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుందని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు భట్టాపురం మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని ఈ రోజు ఉపాధ్యాయులు అనేక సౌకర్యాలు పొందుతున్నారంటే ఆ ఘనత పీఆర్‌టీయూదేనన్నారు. ఇప్పటి వరకు పీఆర్‌టీయూ తరఫున 11 మంది ఎమ్మెల్సీలు గెలిచారని వారి ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించామన్నారు. త్వరలోనే కేజీబీవీ ఉపాధ్యాయులకు, మహిళా ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఉపాధ్యాయులు సెలవులు పొందాలంటే జడ్పీ సీఈవోలు, ఎంఈవోల చుట్టూ తిరిగేవారని ఇప్పుడు పాఠశాలల్లోనే సెలవులు పొందే అవకాశాన్ని పీఆర్‌టీయూ కల్పించిందన్నారు. ఉపాధ్యాయులకు త్వరలోనే హెల్త్‌కార్డులు మంజూరు చేయిస్తామన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు పెంచడంలో పీఆర్‌టీయూ కీలక పాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయులు ఎనిమిదేళ్ల ఒకేచోట పనిచేసిన తర్వాత వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ పొందే అవకాశాన్ని పీఆర్‌టీయూ కల్పించిందన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు రాఘవరెడ్డి, మారుతిరావు పాల్గొన్నారు.

ఘనంగా రవి పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

● ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల



భక్తప్రహ్లాద నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్‌నగర్‌లో గల రవి పబ్లిక్ స్కూల్ 40వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. శ్రావ్య గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటితరం ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని అలా కాకుండా చిన్నప్పటి నుంచే విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం క్రైంరేట్ సైతం ఎక్కువగా పెరుగుతుందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల భారిన ఎక్కువగా యువతనే పడుతున్నారని అన్నారు. 18 ఏళ్లు నిండిన వారికే వాహనాలు ఇవ్వాలని డ్రైవింగ్ లైసెన్స్ ఖచ్చితంగా పొందాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం చేయవద్దని ఆమె సూచించారు. చదువుపైనే శ్రద్ధ పెట్టి తల్లిదండ్రులు, గురువులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం పరీక్షల సమయం కాబట్టి విద్యార్థులంతా చదువుపైనే శ్రద్ధ పెట్టి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భక్తప్రహల్లాద నాటిక, చత్రపతి శివాజీపై రూపొందించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీఐ కిషన్, ప్రముఖ యోగా మాస్టర్ ప్రభాకర్, విద్యాసంస్థల చైర్మన్ మహేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ సరళా మహేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ శ్యామ్, ట్రెజరర్ రేణుమహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల కంటే అదనంగా ఇసుక రవాణా

» టిప్పర్ పరిమితి కంటే 20 టన్నులు అదనంగా తరలింపు

» ప్రభుత్వ ఆదాయానికి రోజుకు రూ.30లక్షల వరకు గండి

» జిల్లా యంత్రాంగానికి విన్నవించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



మాట్లాడుతున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

ఖిల్లా, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): వేబిల్లు అనుమతుల కంటే లారీల్లో అదనంగా ఇసుకను తరలిస్తున్నారని, దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని నిజామాబాద్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి మేరకు టిప్పర్‌లో 10టన్నుల నుంచి 12టన్నుల వరకు తరలించే అవకాశం ఉందన్నారు. అందుకు ప్రభుత్వానికి రూ.4వేల వరకు చెల్లింపు ఉంటుందన్నారు. కానీ 10టన్నులు తరలించే టిప్పర్‌లో 25నుంచి 28టన్నుల వరకు ఇసుకను తరలిస్తున్నారని, దీని ద్వారా ప్రభుత్వానికి టిప్పర్‌కు రూ.6వేల నుంచి 8వేల వరకు ఆదాయం తగ్గుందన్నారు. ముఖ్యంగా బోధన్ నియోజకవర్గంలోని సిద్దాపూర్, సాలూరా మందర్నా నుంచి ప్రభుత్వ పనులు, ఇంటి నిర్మాణాలకు ఇసుక తరలింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అయితే కొందరు నిబంధలన మేరకు ఇసుకను తరలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు ఇసుక రీచ్‌ల నుంచి రోజు 60నుంచి 70 టిప్పర్ల వరకు ఇసు తరలిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ ఇసుక రీచ్‌ల నుంచి 300నుంచి 400 వరకు టిప్పులు తరలించి ఇసుక వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.18లక్షల నుంచి 32లక్షల ఆదాయం నష్టం వస్తుందన్నారు. టిప్పర్ పరిమితికి అదనంగా చెక్కులు పెట్టి అదనపు ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై సంబంధిత శాఖాధికారులకు, ఇన్‌చార్జి సీపీతోపాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించామని వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రవి, లింగారెడ్డి, పవన్‌రెడ్డి, శివారెడ్డి, మజహర్‌పటేల్, నగేష్, ఎస్‌కే.ఖయ్యూమ్, ఇమ్రాన్, నర్సింహా, నవీన్, నారయణ, శ్రావణ్ పాల్గొన్నారు.



నూతన బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ల ఏర్పాటు

ఇందల్వాయి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ యాక్షన్‌లో భాగంగా సిర్నాపల్లి సబ్‌స్టేషన్‌లో రూ.30లక్షల నిధులతో ఏర్పాటు చేసిన రెండు ఎక్స్‌టెన్షన్, మరో రెండు బీసీబీఎస్ పనులను నిజామాబాద్ టెక్నికల్ డీఈ రమేష్ శుక్రవారం ప్రారంభించారు. దీంతో పాటు గౌరారం సబ్‌స్టేషన్ నుండి సిర్నాపల్లి సబ్‌స్టేషన్ వరకు 69లక్షల రూపాయల నిధులతో 33 కేవీ లింక్‌లైన్ పనులు నల్లవెల్లి గ్రామంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులకు సహకరించిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి విద్యుత్ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్‌జాడే, ఏడీ శ్రీనివాస్, ఏఈ జ్ఞానేశ్వర్, ఆయా గ్రామాల వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి

మోపాల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) నగరంలోని లక్ష్మీప్రియనగర్‌లో వ్యబిచారం నిర్వహిస్తున్న గృహంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, ఇద్దరు విటులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 670 నగదు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, తదుపరి చర్యల నిమిత్తం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐకు అప్పగించామని వారు తెలిపారు.

కుంభమేళాలో స్నానం ఆచరించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి దంపతులు



పుణ్యస్నానం చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి దంపతులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి దంపతులు శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందువులు వివిధ రూపాల్లో ఉన్న ప్రకృతిని దైవంగా భావిస్తారని, అలాంటి గొప్ప ఆచారం హిందువులకు మాత్రమే ఉందన్నారు. కుంభమేళాలో ఏర్పాట్లు చాలా బాగున్నాయని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు.

కోనేరు పునర్నిర్మాణానికి విరాళం

నవీపేట, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని చరిత్రాత్మక రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో నూతనంగా కోనేరు పునర్నిర్మాణ పనులకు భక్తుడు విరాళం అందజేశాడు. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన మునిపల్లి శివ శుక్రవారం స్థానిక రాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శించి తనవంతుగా 21,116రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బినోల సోసైటీ చైర్మన్ హన్మాండ్లు, శ్యామ్, రాజు, రాజేందర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న యశోద ఆసుపత్రి న్యూరో సర్జన్ కేఎస్ కిరణ్

యశోద ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని న్యూరో సర్జన్ కేఎస్ కిరణ్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిచ్‌పల్లికి చెందిన ఫర్జానా బేగం తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ తిమ్మిర్లు, చూపు మందగించడం, తెలియకుండా పడిపోవడం వంటివి జరిగేవని తెలిపారు. కొన్నిసార్లు ముఖాకృతి మారడం, ముక్కు, నాలుక, దవడం పరిమాణం పెరగడం, పళ్ల అమరికలో మార్పులు, ఆహారం మింగడంలో ఇబ్బందులు, చేతులు, కాళ్ల వాపు వంటి వ్యాధి లక్షణాలతో తమ దగ్గరికి వచ్చిందని ఆమెకు ఎంఆర్‌ఐ బ్రెయిన్ చేయించి చూడగా పెద్ద పిట్యూటరీ ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ట్రాన్స్ ఎండోస్కోపీతోపాటు ట్రాన్స్ నాజల్ పద్ధతిలో ఆపరేషన్ ద్వారా ట్యూమర్‌ను తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇలాంటి వ్యాధి వల్ల గ్రోత్ హార్మోన్స్, సీక్రేషన్స్ వల్ల మనిషి ఇబ్బందులు పడే పరిస్థితితో పాటు చనిపోయే పరిస్థితి కూడా ఉంటుందని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఈఅరుదైన వ్యాధికి విజయవంతంగా శస్త్రచికిత్స చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు సిటీ స్కాన్ చేయగా పూర్వపు లక్షణాలు, రక్తస్రావం, వాపు వంటి కనబడలేదని, న్యూరో హెచ్‌డీయూలో ఒక రోజు ఉంచి జనరల్ వార్డుకు తరలించడం జరిగిందన్నారు. సర్జరీ అనంతరం రోగిని స్థిరమైన స్థితిలో డిచ్ఛార్జ్ చేశామని తలనొప్పి మరియు సర్జరీకి ముందు ఉన్న సమస్యలన్నీ పోయాయని తెలిపారు. ఈ సమావేశంలో యశోద మార్కెటింగ్ మేనేజర్ నర్సింహారెడ్డి, శ్రీరాం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

(ఐదో పేజీ తరువాయి)

కాలయాపన చేస్తుందన్నారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతుంటే ఉద్యోగుల పక్షాన 317 జీవోకు వ్యతిరేకంగా బీజేపీ ఉద్యమం చేపడితే అరెస్టులు, లాఠీచార్జీలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. 6వేల కోట్ల పైచిలుకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల కారణంగా పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, కొమురయ్యలు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రవీంధర్, భోజాగౌడ్, ఆశయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త పనిచేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌కులాచారి

ధర్పల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం సృష్టిస్తుందని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సైనికులా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, నాయకులు కర్నగంగారెడ్డి, పాల్దిగంగాదాస్, మురళీగౌడ్, మహేష్, సేవాలాల్, రాము, రాజశేఖర్, నవీన్, శ్రీకాంత్, కచ్చకాయల గంగాధర్‌పాల్గొన్నారు.

సిరికొండ: శాసనమండలి ఎన్నికల్లో పార్టీని నియమించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. శుక్రవారం సిరికొండలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఓబీసీ రాష్ట్ర నాయకులు రామస్వామి, మాజీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల రేణుక ఎల్లమ్మ దేవాలయంలో దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ఓడిబియ్యాన్ని సమర్పించుకున్నారు. వార్షికోత్సవంలో భాగంగా ఎల్లమ్మగుట్ట దేవాలయ ప్రాంగణంలో బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


పెద్దమ్మ ఆలయంలో చండీహోమం



ఆలయం ఆవరణలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

ముప్కాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూడో రోజు పురోహితుడు ప్రకాష్‌జోషి ఆధ్వర్యంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పంచామృతాభిషేకం, లలిత సహస్ర నామార్చన పారాయణం, సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89300	రూ.82400	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.15, 4.00, 7.10, 10.20)
: బాపు (1.25)
స్ర్కీన్-2 : చావా (హిందీ) (10.00, 7.20, 10.40)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (1.20)
: జాబిలమ్మ నీకు అంత కోపమా (4.30)
స్ర్కీన్-3 : జాబిలమ్మ నీకు అంత కోపమా (10.30): చావా (హిందీ) (1.20)
: తండేల్ (4.40, 10.20) : బాపు (7.45)
స్ర్కీన్-4 : ది డెవిల్స్ ఛైర్ (11.30)
: రామం రాఘవం (1.45): చావా(హిందీ) (4.20)
: సంక్రాంతికి వస్తున్నాం (7.40)
: జాబిలమ్మ నీకు అంత కోపమా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : జాబిలమ్మ నీకు అంత కోపమా (11.00)
: చావా (హిందీ) (1.40, 7.30, 10.20)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (4.30)
స్ర్కీన్-2 : చావా (హిందీ) (11.00, 4.40)
: జాబిలమ్మ నీకు అంత కోపమా (1.40, 7.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.20)
స్ర్కీన్-3 : తండేల్ (1.45, 4.40, 7.35)
: బాపు (10.30)

దేవి: జాబిలమ్మ నీకు అంత కోపమా (11.15, 6.15)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (2.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్